సాక్షి నిర్మల్
గురువారం ; 18 ; మే ; 2023



మూగజీవాలు విలవిల
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వడగాలులకు మనుషలతో పాటు మూగ జీవాలు అల్లాడుతున్నాయి. 8లో▸



అన్నదాతకు అండగా..
రైతులందరినీ ఒకేచోట చేర్చి వారికి పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు నిర్మించిన రైతువేదికలు అన్నదాతకు అండగా ఉంటున్నాయి. 9లో▸


వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.8 /29.5
చాలావరకు ఎండగా ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

ఎండల్లో జర పైలం!

నిర్మల్‌చైన్‌గేట్: సాధారణంగా ఎండాకాలం రాగానే ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోయి ఇబ్బందులు తలెత్తుతాయి. వడదెబ్బతో అస్వస్థతకు గురవుతారు. ఒక్క వడదెబ్బే కాదు.. వేడి కారణంగా పలు రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయి. ముఖ్యంగా ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, చర్మ సమస్యలు, వాంతులు, విరేచనాలు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు పెరుగుతాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకుపైగా నమోదవుతోంది. దీంతో వేసవిలో తలెత్తే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు సూచిస్తున్నారు.



కిడ్నీ బాధితులు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



- వీలైనంతవరకు నీడ పట్టునే ఉండాలి. బయటకు వెళ్తే గొడుగు వాడుకోవాలి. వెడల్పు అంచు గల టోపీ ధరించాలి.
- బయటకు వెళ్లినప్పుడు నీళ్లు వెంట ఉండడం మంచిది.
- వడదెబ్బ తగిలినవారిని వెంటనే నీడలోకి చేర్చాలి. తడి బట్టతో తుడుస్తూ శరీరాన్ని చల్ల బర్చాలి. నోటితో ద్రవాలు తీసుకోలేని స్థితిలో ఉంటే రక్తనాళం ద్వారా సెలైన్, విటమిన్లు, మినరల్స్ ఇవ్వాలి.

గుండె జబ్బువారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



- ఎండ ఎక్కువ ఉండే సమయంలో వ్యాయామం చేయకూడదు.
- వదులైన, నూలు దుస్తులు ధరించాలి. ఇంట్లో, ఆఫీసులో చల్లగా ఉండేలా చూసుకోవాలి.
- కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండడం మంచిది. కాఫీ, మద్యంతో నీరు ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంది. మజ్జిగ, పళ్లరసాలు వంటివి తీసుకోవచ్చు.
- ఒకేసారి ఎక్కువ తినకుండా కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తినడం మంచిది.
- వాంతులు, వికారం, నిస్సత్తువ, తలనొప్పి, ఏకాగ్రత లోపించడం, కండరాలు పట్టేయటం వంటి డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

వాటర్ బాటిళ్లు తీసుకెళ్లాలి..



– డాక్టర్ వాసు, చిన్నపిల్లల వైద్యులు

వేసవి కాలంలో చాలా మంది పిల్లలు ఆటల్లో పడిపోయి నీళ్లు తాగడం మర్చిపోతుంటారు. దీంతో డీహైడ్రేషన్‌కు గురవుతుంటారు. అందుకే

- ఈ వేసవికాలంలో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలతో నీళ్లు ఎక్కువ తాగించాలి. కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, మజ్జిగ, రాగి జావ, సబ్జా వాటర్ ఎక్కువగా ఇవ్వాలి.
- అధిక వేడి కారణంగా పిల్లలు డయేరియా బారిన పడుతుంటారు. ఈ సమస్య నుంచి పిల్లలను రక్షించుకోవాలంటే ఇంట్లో వండిన తాజా ఆహారాన్నే పిల్లలకు పెట్టాలి.
- మండే ఎండల్లో వారిని ఆటలకు పంపించొద్దు. ఉదయం, లేదా సాయంత్రం ఎండ తీవ్రత తక్కువగా ఉండే సమయంలోనే పిల్లలను ఆరుబయట ఆడనివ్వాలి.
- కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, నూనెలో వేయించిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్స్, కూలింగ్ వాటర్, స్వీట్స్ వంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచాలి. తాజా ఆకుకూరలు, పెరుగు, పండ్లు, చక్కెర జోడించని స్మూతీలు, సీఫుడ్, సలాడ్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి.

అధిక రక్తపోటు.. నియంత్రణ చర్యలు



అధిక రక్తపోటు చికిత్స పొందుతున్న రోగులు కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఎలక్ట్రోలైట్ స్థాయిలను నిర్వహించవచ్చు. ఆహారంలో పాలు, జున్ను, అరటి పండ్లు, ఆకుకూరలు, నారింజ, చిలగడదుంపలు, గింజలను చేర్చడం ద్వారా వీటిని పొందవచ్చు. నీరు ఎక్కువగా తాగాలి.

– డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజీషియన్

గర్భిణులు జాగ్రత్త



తీవ్రమైన ఎండలు, ఉక్కపోత గర్భిణులకు మరింత ఇబ్బందిగా ఉంటుంది. సాధారణ వ్యక్తుల్లో నీరు.. చెమట, మూత్రం రూపంలోనే బయటకు వెళ్తుంది. పిండానికీ నీళ్లు అవసరమవుతాయి. అందుకే వారికి అదనపు నీరు కావాలి. లేకపోతే పిండం ఎదుగుదల ఆగిపోతుంది. ఉమ్మనీరు తగ్గిపోయి శిశువు చనిపోయే ప్రమాదం ఉంటుంది. వారికి తరచూ నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, ఎలక్ట్రా పౌడర్, గ్లూకోజ్ తాగిస్తూ ఉండాలి. ఎండలో బయటకు వెళ్లకూడదు. వైద్య పరీక్షల కోసం ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే వెళ్లాలి.

– సరోజ, గైనకాలజిస్ట్, జిల్లా ఆసుపత్రి నిర్మల్

పెంపుడు జంతువులు పైలం...



పెంపుడు జంతువులైన కుక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారంతోపాటు తాజా నీటిని అందించాలి.

- ఉదయం 7లోపు, సాయంత్రం 6 గంటల తర్వాత మాత్రమే వ్యాయామం కోసం బయటకు తీసుకురావాలి.
- ఎండ తగలకుండా చల్లటి వాతావరణం ఉండేలా చూసుకోవాలి. వాటికి దగ్గరగా తొట్టిలో నీరు ఉంచితే మంచిది. పక్షులు పెంచేవారు ఇంట్లోని సాధారణ ఫ్యాన్ గాలితో వేసవి నుంచి రక్షించవచ్చు.

– నగ్గం మహేశ్, పశువైద్యాధికారి

పుస్తకంతో దోస్తీ

- చిన్నారుల్లో అభిరుచి పెంచాలి
- వేసవి సెలవులే మంచి తరుణం



నిర్మల్‌ఖిల్లా: పుస్తకమా పుస్తకమా.. నిన్ను చదవడం వల్ల ఉపయోగం ఏంటీ అంటే..‘తలదించుకుని నన్ను చదువు.. జీవితంలో నిన్ను తలెత్తుకుని జీవించేలా తయారుచేస్తా’ అందట పాఠకుడితో. విజేతలను మీ అభిరుచి ఏమిటని ప్రశ్నిస్తే, ఎక్కువమంది ఠక్కున చెప్పే సమాధానం పుస్తక పఠనం. జీవితంలో వెలుగులు నింపే గొప్ప అస్త్రం పుస్తకం. అందుకే ‘చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో’ అని ప్రముఖకవి కందుకూరి విరేశలింగం పుస్తకాల ఆవశ్యకతను ఏనాడో చెప్పారు. ఎంత చదివితే అంత విజ్ఞానవంతుల్ని చేయగలిగే ఏకైక శక్తి పుస్తకానికే ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు క్రమంగా తగ్గుతోంది. ఆన్‌లైన్ అభ్యసనతో పట్టుమని 10 నిమిషాలు కూడా విద్యార్థులు పుస్తకాలు చదవలేకపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లలకు తల్లిదండ్రులు, గురువులు నేర్పించే అతిముఖ్యమైన అలవాటు పుస్తక పఠనమే. మన పిల్లల్ని కూడా పుస్తకాలతో దోస్తీ కట్టించేందుకు వేసవి సెలవులే మంచి తరుణం.

గ్రంథాలయాలతో ప్రయోజనం..
వేసవి సెలవుల నేపథ్యంలో గ్రంథాలయాలకు విద్యార్థుల్ని తీసుకెళ్లి పుస్తకాలు, పత్రికలు చదివేలా ప్రోత్సహించాలి. ఓ సర్వే ఆధారంగా చూస్తే 14 ఏళ్ల లోపు పిల్లల్లో రోజూ గ్రంథాలయానికి వచ్చేవారు కేవలం ఒక శాతమే. వారి సంఖ్యను గణనీయంగా పెంచాలంటే ఉపాధ్యాయులే కాదు, తల్లిదండ్రుల్లోనూ మార్పు రావాలి. పుస్తక పఠనమే జీవితంలో ఎదిగేందుకు సోపానమని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. విద్యా సంబంధ విషయాలకు పుస్తకాలే కాకుండా నీతికథలు, ఆటలు, కళలు, మంచి అలవాట్లు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు చదివించాలి. జన్మదినాలకు కానుకలుగా పుస్తకాల్ని పిల్లలకు బహుమానంగా అందించాలి. విజేతల ఆత్మకథలు చదివించాలి. వ్యక్తిత్వ వికాస నిర్మాణం, నైపుణ్యాల పెంపు, భావవ్యక్తీకరణ మెరుగ్గా ఉండేందుకు పుస్తక పఠనానికి మించిన అస్త్రం మరొకటి లేదని పిల్లలకు తెలియజెప్పాలి.

పఠనంతో.. ప్రయోజనాలెన్నో..
- ఒంటరితనం పారద్రోలి మంచి స్నేహితులుగా పుస్తకాలు వ్యవహరిస్తాయి. నైరాశ్యం దరిచేరదు..
- ఏకాగ్రత పెరుగుతుంది. విషయాన్ని శ్రద్ధగా చదవడం అలవాటవుతుంది.
- ‘పద సంపద’ వృద్ధిచెంది భాషపై పట్టు పెరుగుతుంది. చక్కటి భావ వ్యక్తీకరణకు దోహదం చేస్తుంది .
- మెదడు పనితీరు మెరుగు పడుతుంది.
- ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. వాటిద్వారా మన లోకజ్ఞానం రెట్టింపవుతుంది.
- మానసికంగా దృఢం అయ్యేందుకు దోహదపడుతుంది..
- సృజనాత్మకత పెంపొందించడానికి పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానం తోడ్పడుతుంది.
- విజేతల ఆత్మకథలు చదివినప్పుడు స్ఫూర్తి , ప్రేరణ పొందవచ్చు.
- పరాజితుల అనుభవాలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపిస్తాయి. ఒత్తిడిని తగ్గించడానికి పుస్తక పఠనం దివ్యఔషధంగా పనిచేస్తుంది.

పఠనాసక్తి పెంచండిలా...
- రోజువారీపనుల్లో తీరికలేకుండా ఉన్నా కనీసం 10 నిమిషాలు పుస్తక పఠనానికి కేటాయించాలి.
- తొలుత నచ్చిన పుస్తకం, తక్కువ పేజీలున్నవి ఎంపిక చేసుకుంటే ఆసక్తి పెరుగుతుంది.
- ఎక్కువ పేజీలున్నవైతే రోజుకు పది చొప్పున పూర్తిచేస్తే ఏడాదిలో 200 పేజీలున్న 18 పుస్తకాలు చదవొచ్చు.
- రోజువారీ పనుల్లో విరామం దొరికినప్పుడు కాలక్షేపం కోసం పఠించాలి.
- చిన్నారులతో చందమామ కథలు, బాలవికాస పుస్తకాల్ని చదివించాలి..

జిల్లా వివరాలు

జిల్లాలో గ్రంథాలయాలు	16
సభ్యత్వం కలిగిన పాఠకులు	15,200

ఇల్లే గ్రంథాలయంగా..



స్వతహాగా పుస్తకాలు చదవడం చిన్నప్పటినుంచే అభిరుచిగా మారింది. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండడం కూడా ఒక కారణం కావచ్చు. ఎక్కడ కొత్త పుస్తకం కనపడినా వెంటనే కొనేయడం అలవాటైంది. అదే విధంగా మిత్రులు, సాహితీవేత్తలు కానుకగా ఇచ్చిన మరికొన్ని పుస్తకాలతో ఇంట్లోనే ఓ చిన్నపాటి గ్రంథాలయం ఏర్పాటైంది. ఏ కాస్త సమయం దొరికినా పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తుంటాను. అలా పుస్తకాలతో దోస్తీ ఏర్పడింది. పుస్తకాలు చదవడం వల్ల మానసిక ప్రశాంతత దొరుకుతుంది.ఇప్పటి పిల్లలకు చిన్నప్పటినుండే పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలి. అది పెద్దయ్యాక మంచి అలవాటుగా మారుతుంది.

– అంబటి నారాయణ, పుస్తక పఠనాభిలాషి, నిర్మల్

అందుబాటులో అన్ని పుస్తకాలు

వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత కాలా న్ని సద్వినియోగం చేసుకుంటూ పుస్తకాల ప ఠనాభిరుచిని పెంపొందించుకొనుటకు సరైన అవకాశం ఇది. అదేవిధంగా ఉద్యోగాలకు సన్నద్ధవుతున్న అభ్యర్థులకు కూడా పుస్తకాల ను జిల్లాకేంద్రంలోని ప్రధాన గ్రంధాలయంలో అందుబాటులో ఉంచాం. ఆయా మండలకేంద్రాలలోని శాఖ గ్రంథాలయాల్లో కూడా దినపత్రికలు, వార, మాసపత్రికలతోపాటుగా పోటీ పరీక్షల కోసం వివిధ పుస్తకాలు, మెటీరియల్ చదువుకునే అవకాశం ఉంది.

– విజయశ్రీ, గ్రంథాలయాధికారి-గ్రేడ్ 2, జిల్లా కేంద్ర గ్రంథాలయం, నిర్మల్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

నిర్మల్ రూరల్: ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ బుధవారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2,418 మంది విద్యార్థులకు 2,278 మంది హాజరయ్యారు. మొత్తం 1,243 మంది బాలురకు 1,182 మంది హాజరవగా 61 మంది గైర్హాజరయ్యారు. బాలికలు 1,175 మంది 1,096 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటలకు పరీక్ష నిర్వహించారు. నిమిషం నిబంధన అమలు చేయడంతో విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే 5 నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికట్లు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ఆదివారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు పట్టణంలోని నలంద కళాశాలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌ను www.tsstudycircle.co.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఫిష్ మార్కెట్ కోసం స్థలం ఎంపిక



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కడెం: మండల కేంద్రంలో ఫిష్‌మార్కెట్ ఏర్పాటు కోసం కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం స్థల పరిశీలన చేశారు. కడెం ప్రాజెక్ట్‌కు వెళ్లే దారిలోని ప్రాజెక్ట్ పాత పవర్‌హౌస్ స్థలాన్ని ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య తెలిపారు. వారివెంట ఎంపీపీ అలెగ్జాండర్ ఉన్నారు.

పట్టువదలకుండా.. మెట్టు దిగకుండా...



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట దీక్షలో వీవోఏలు

- 30 రోజులకు చేరిన వీవోఏల సమ్మె
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్
- అదనపు పనిభారంతో సతమతమవుతున్నామని ఆవేదన
- ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నపం

ఖానాపూర్: రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా గ్రామ స్థాయిలో అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన సమ్మె 30 రోజులకు చేరింది. నెల రోజులుగా ప్రభుత్వం సమ్మెపై స్పందించకపోయినా వీవోఏలు పట్టు వీడడం లేదు. అదే సమయంలో ప్రభుత్వం కూడా మెట్టు దిగిరావడం లేదు. పనికి తగిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని, పనిభారం తగ్గించడం లేదని వీవోఏలు పేర్కొంటున్నారు.

సమ్మెకు ముందే 13 రోజుల నిరసన..
దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 16 నుంచి చేపట్టిన సమ్మెకు ముందే ఏప్రిల్ 3 నుంచి 16 వరకు 13 రోజులు ఆన్‌లైన్ సేవలు చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంతో ఏప్రిల్ 17 నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు.

జిల్లాలో 504 మంది వీవోఏలు..
జిల్లాలో మొత్తం 504 మంది వీవోఏలు 11,983 స్వయం సహాయక సంఘాలు, 1,03,402 మంది సభ్యులు, 18 మండల సమాఖ్యలు, 504 గ్రామ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు నెల రోజులుగా సమ్మె చేస్తున్నారు. మొదట 20 రోజులు అన్ని మండల కేంద్రాల్లో నిరవధిక రిలే దీక్షలు చేపట్టారు. పది రోజులుగా నియోజకవర్గ, డివిజన్ కేంద్రాల్లో దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీవోఏల సమ్మె కారణంగా శ్రీనిధి రుణాలు, వీవో అంతర్గత రుణాలు, బ్యాంకు రుణాల రికవరీలు ఆగిపోయాయి.

పనిభారంతో సతమతం..
- టార్గెట్ పూర్తి చేస్తేనే వేతనాలు ఇస్తామని చెబుతుండడంతో వీవోఏలు ఆందోళన చెందుతున్నారు.
- ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతీ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో వీరి సేవలను అధికారులు వినియోగించుకుంటున్నా పనికి తగిన వేతనం అందడం లేదు.
- పొదుపు సంఘాలకు సంబంధించి పలు పుస్తకాలు రాయడం, మినిట్స్ బుక్స్, వేలి ముద్రలు తీసుకోవడం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితర పనులు వీవోఏలపై మోపుతుండడంతో అదనపు భారం పడుతోంది.
- ఈ సంఘాలకు ఆన్‌లైన్ ద్వారా చేసిన పనికి రూ.3,900 మాత్రమే గౌరవవేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది.

డిమాండ్లు ఇవీ..
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి.
- రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.
- సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయాలి.
- గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలి.
- జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని ఆన్‌లైన్ పనులతో సహా ఇతర పనులు చేయించొద్దు
- వీవోఏలపై మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అభయహస్తం డబ్బులు చెల్లించాలి.
- ఎస్‌హెచ్‌జీ, వీఏ లైవ్ మీటింగ్స్ రద్దు చేయాలి
- అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలి.

విధులు.. బాధ్యతలు..
- పొదుపు సంఘాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాలు, తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేస్తుంటారు.
- సభ్యుల్లో క్రియాశీలకంగా ఉన్న ఒకరిని ఎంపిక చేసి ఈ బాధ్యతలు అప్పగిస్తారు.
- స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో సమన్వయపరచడంలో వీవోఏల పాత్ర కీలకం.
- కొత్త సంఘాల ఏర్పాటు, చిన్న సంఘాల బుక్స్ రాయడం, సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు, స్త్రీనిధి రుణాల మంజూరు, మొబైల్ డేటా ఎంట్రీ, సభ్యుల ఆధార్, బ్యాంక్ అకౌంట్ల పరిశీలన, జీవనోపాధి, ఆరోగ్యం, జాబ్‌మేళాల ద్వారా ఉపాధి కల్పన తదితర కార్యక్రమాల్లో కీలకపాత్ర వహిస్తారు.
- కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి రైతులకు ఇబ్బంది కాకుండా చూస్తారు.
- హరితహారం మొక్కల పంపిణీ, సంరక్షణ, ఎన్నికల విధులు
- బతుకమ్మ చీరల పంపిణీ, కంటివెలుగు, పల్లెప్రగతి, కరోనావ్యాక్సిన్‌లో సహకారం, రేషన్‌కార్డులు, పెన్షన్ సర్వే, సదరం క్యాంపు నిర్వహణలో భాగస్వామ్యం, రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాట్లు, కొత్త సంఘాల ఏర్పాటు
- స్వచ్ఛభారత్, సామాజిక ఇన్సూరెన్స్, నిరక్షరాస్యుల సర్వే, ఫైలేరియా సర్వే వంటివి చేస్తారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..



మార్చి 25 నుంచి ఏప్రిల్ 17 వరకు విధులకు వెళ్లకుండా నిరసన వ్యక్తం చేశాం. ఏప్రిల్ 17 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నాం. నెల రోజులైనా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. 20 ఏళ్లుగా సంఘాల అభివృద్ధితోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతోపాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– జయశీల, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



వంటకాలను పరిశీలిస్తున్న నాయకులు,అధికారులు

లక్ష్మణచాంద: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు చిరు ధాన్యాలతో వంటకాల తయారు పోటీలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై చిరు ధాన్యాలతో తయారు చేసిన వివిధ వంటకాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. కొర్రలు, రాగులు, సజ్జలు వంటి చిరు ధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉంటాయని తెలిపారు. నిత్యం తీసుకునే ఆహారంలో చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు తీసుకోవాలని సూచించారు. పోటీల్లో లక్ష్మణచాంద సెక్టార్ విభాగంలో కొర్రలతో ఉప్మా తయారు చేసిన పొట్టపెల్లి(కె) అంగన్‌వాడీ టీచర్ సునీత మొదటి బహుమతి, తిర్పెల్లి అంగన్‌వాడీ టీచర్ రెండో బహుమతి గెలుచుకున్నారు. వడ్యాల్ సెక్టార్ పరిధిలో రాగులతో దోశ తయారు చేసిన బోరిగాం అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి మొదటి బహుమతి, నర్సాపూర్ అంగన్‌వాడీ టీచర్ రెండో బహుమతి సాధించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యామ్‌రావ్‌రాథోడ్, తహసీల్దార్ కవితరెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే మంత్రి తిట్ల దండకం



మాట్లాడుతున్న రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులపై తిట్ల దండకం అందుకున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం మాట్లాడారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక మంత్రి కేంద్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణను ఖండించారు. న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తున్న ఐకేరెడ్డి న్యాయంగా మాట్లాడితే బాగుంటుందన్నారు. ఒక సిలిండర్‌పై రూ.400, లీటర్ పెట్రోల్‌పై రూ.42 తన వాటా కింద రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుందని తెలిపారు. ప్రజలపై ప్రేమ ఉంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తగ్గించినట్లుగా ధరలు తగ్గించాల ని సూచించారు. ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని భావించి మంత్రి అయోమయానికి గురవుతున్నార ని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇంద్రకరణ్‌రెడ్డి హామీ ఇచ్చిన పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, ఆర్మూర్ టు ఆదిలాబాద్ రైల్వేలైన్ కలగా మిగిలాయన్నారు. సమావేశంలో బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాబా పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ కట్టడం కూల్చివేత



జేసీబీతో కూల్చి వేస్తున్న అధికారులు

కుంటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో శిలారీ గణేశ్ అనే వ్యక్తి అక్రమంగా కట్టడం నిర్మించాడు. గ్రామానికి చెందిన పలువురు అక్రమ కట్టడంపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చినా గణేశ్ స్పందించలేదు. దీంతో బుధవారం ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్సై హన్మండ్లు పరిస్థితులను చక్కబెట్టారు.

బీజేపీ కార్యకర్త అనే కూల్చివేశారు..

శిలారీ గణేశ్ బీజేపీ కార్యకర్త కావడంతోనే స్థానిక నాయకులకు అధికారులు తలొగ్గి కూల్చివేశారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ ఆరోపించారు. బుధవారం కూల్చివేసిన కట్టడాన్ని ఆయన పరిశీలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని అధికారులు బుధవారం కూల్చివేసిన విషయం తెలిసిందే. విధులకు ఆటంకం కలిగించినందుకు గానూ శిలారీ రాణి, వేముల సాయిపై పంచాయతీ కార్యదర్శి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు




లారీని ఢీకొట్టిన కారు

నేరడిగొండ(బోథ్): మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున ఆగివున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పొడే విష్ణు, సైఫ్అలీఖాన్ కారులో నేరడిగొండకు వెళ్తుండగా కుప్టి జాతీయ రహదారి సమీపంలో ఆగివున్న లారీని వెనకనుంచి ఢీకొట్టారు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అయితే ప్రమాదానికి గురైన ఆ కారును మరో లారీ ఢీకొనడంతో పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయన్న పరిశీలించారు.

నేడు ఓసీపీ బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో పనిచేసే ఓవర్ మెన్లు, హెడ్ ఓవర్‌మెన్లు ఓసీపీలకు బదిలీపై వెళ్లడానికి గురువారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవింద రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలోని వారికి శ్రీరాంపూర్ వీటీసీలో ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున దరఖాస్తు చేసుకున్న వారు ఈ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

మూగజీవాలు విలవిల



మండుతున్న ఎండలకు చెట్టు నీడన చేరిన మేకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వడగాలులకు మనుషులతో పాటు మూగజీవాలు అల్లాడుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదవుతున్నాయి. పాడిపశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాలు వేసవితాపంతో అవస్థలు పడుతున్నాయి. వేసవిలో పాడిపశువులు, మూగజీవాల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ వై.రమేశ్‌కుమార్ వివరించారు.



- చెట్ల నీడన, నీటిమడుగుల్లో ఉపశమనం
- ఎండ దెబ్బతగిలి మృత్యువాత పడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



ఎండల తీవ్రతతో నీటి మడుగులో ఉపశమనం పొందుతున్న గేదెలు

పెంపుడు జంతువులను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు తీసుకెళ్లాలి. కొట్టాల చుట్టూ తట్టుబొంతలు కట్టి నీటితో తడిపితే వడగాలుల ప్రభావం తాకదు. పచ్చిమేత, తడిపిన దాణా ఇవ్వడం మంచిది. పశువుకు రోజుకు సుమారు 50 నుంచి 60 లీటర్ల నీటిని తాగించాలి. దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడం వల్ల తొందరగా డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. వడదెబ్బకు గురైన పశువులు, ఇతర జీవాల శరీర ఉష్ణోగ్రత పెరిగి, నోరు తెరిచి భారంగా శ్వాసతీస్తూ అటుఇటు ఉగుతూ బాధపడుతాయి. అలాంటి పశువులను వెంటనే తల, శరీరభాగాలను నీటితో తడుపుతూ నీటిపట్టున ఉంచి సమీపంలో ఉన్న పశువైద్యాధికారికి చూపించి చికిత్స అందించాలి.

వేసవిలో సోకే వ్యాధులు

వేసవిలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు ఎక్కువగా వస్తాయి. గొంతువాపు ఓ అంటువ్యాధి. వ్యాధి సోకిన పశువులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవడం వల్ల గురక లాంటి శబ్దం వస్తుంది. అందుకే దీనిని గురుక వ్యాధి అని కూడా అంటారు. ముఖ్యంగా 6 నెలల నుంచి 2 సంవత్సరాల వయస్సు ఉన్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. పశ్చరుల్లా మల్టోసిడా అనే బాక్టీరియా వల్ల గొంతువాపు వ్యాధి సోకుతుంది. వాతావరణం చల్లగా ఉండి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, వేసవిలో మేత లేక, వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవించినప్పుడు, సూదుర ప్రయాణాలు చేసినప్పుడు పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వేడిగాలుల నుంచి కోళ్లకు రక్షణ..

కోళ్లకు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే షెడ్డు మీద గడ్డి, తాటాకులు లేదా కొబ్బరి మట్టల్ని కప్పాలి. దీనివల్ల షెడ్డు లోపలి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గుతాయి. కోళ్ల ఫారంలోకి గాలి ధారళంగా ప్రసరించేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. షెడ్డు పై భాగంలో స్ప్రింక్లర్లతోనూ ఫాగర్ల వంటి పరికరాలతోనూ నీటి తుంపర్లు పడేలా చూడాలి. కోళ్లకు ఎలక్ట్రోలైట్లను అందించాలి. కోళ్లఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లు పెంచడం మంచిది. కోళ్లు వడదెబ్బకు గురైతే వాటిని తల మునగకుండా మిగిలిన శరీరాన్ని చల్లటి నీటిలో ముంచి తీయాలి. దీనివల్ల కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుతుంది.

కోళ్లకు సోకే వ్యాధులు

కొక్కెర

కోళ్లకు వచ్చే వ్యాధుల్లో అత్యంత భయంకరమైనది కొక్కెర. వ్యాధి సోకిన కోడి ముడుచుకుని ఉంటూ రెక్కల్ని వేలాడేస్తుంది. పక్షవాతపు లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. తెలుపు, ఆకుపచ్చ రంగులో విరేచనాలు అవుతాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంది. కోడి శరీరంలోని కొన్ని భాగాల్లో సన్నని రక్తపు చుక్కలు కనిపిస్తాయి. వ్యాధి నివారణకు మందులేవి లేవు. కాబట్టి ఈ వ్యాధి రాకుండా కోళ్లకు ముందుగానే టీకాలు వేయించాలి.

గంబోరో

బాయిలర్ కోడిపిల్లలు వారం నుంచి రెండు నెలల వయసు వచ్చే వరకు గంబోరో వ్యాధికి ఎక్కువగా గురవుతాయి. నీళ్ల విరేచనాలు అవుతాయి. సరిగా నిలబడలేవు. వణుకుతాయి. వ్యాధి సోకిన కోడి పిల్లల్ని వెంటనే ఇతర కోళ్ల నుంచి వేరుచేయాలి. నీటిలో యాంటి బయాటిక్స్ విటమిన్లు కలిపి ఇస్తే కొంత ఉపశమనం లభిస్తుంది. వ్యాధి నివారణకు 10 నుంచి 14 రోజుల వయసులో టీకాలు వేయించాలి.

కోరైజా

ఈ వ్యాధి సోకిన కోడిపిల్లలు మేత, నీటిని సరిగా తీసుకోలేక బరువు కోల్పోతాయి. ముక్కు, కండ్లు ఉబ్బి, తెల్లని చీము గడ్డల మాదిరిగా తయారవుతాయి. పశువైద్యుల సలహా మేరకు కోడిపిల్లలకు వారం రోజుల పాటు యాంటిబయాటిక్స్, విటమిన్లు అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది.

తగిన సమయంలోనే నీరు, దాణా..

కిలో బరువు దాటిన కోళ్లకు ఉదయం 10 నుంచి సాయత్రం 4 గంటల వరకు దాణా ఇవ్వకూడదు. సాయత్రం వేళ దాణా కొంచెం తడిపి ఇవ్వడం మంచిది. దాణాలో క్రమం తప్పకుండా టాక్సిన్ బైండర్లను కలపాలి. ఎనర్జీ శాతం తక్కువగా ప్రొటీన్ల పరిమాణం తగుమోతాదులో ఉండేలా చూడాలి. టన్నుదాణాకు 200 గ్రాముల విటమిన్ (సి)ని తగిన మోతాదులో సోడా ఉప్పును కలిపితే వడదెబ్బ బారినుంచి కాపాడుకోవచ్చు. వాటికి అందించే నీటిలో విధిగా శానిటైజర్లను కలపాలి. డీప్ లిట్టర్‌లో కోళ్లను పెంచే వారు ఎక్కువ నీటిగిన్నెల్ని ఏర్పాటు చేయాలి. చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. కోడి పిల్లలకు చల్లని నీటిలో ఎలక్ట్రోలైట్లను కలిపి ఇవ్వడం ద్వారా డీహైడ్రేషన్ సమస్య నివారించవచ్చు.

బాలిక అపహరణ కేసులో ఒకరి అరెస్ట్

సారంగపూర్(నిర్మల్): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్‌కు యత్నించిన కేసులో ఒకరిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. 15 రోజుల క్రితం ఓ బాలికను మరో బాలుడు అపహరణకు యత్నించాడని పేర్కొన్నారు. దీంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలున్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతనికి సహకరించిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అతని స్నేహితుడు జెందాడే సచిన్(18)ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా గన్నేరి గ్రామానికి చెందిన బోర్కర్ సంతోష్(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 16న అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా ఊరి చివర వాగు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పురుగుల మందు తాగినట్లు తెలపడంతో మహారాష్ట్రలోని అర్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరి పంట దగ్ధం



ఆలూరులో దగ్ధమవుతున్న వరిపంట

సారంగపూర్(నిర్మల్): మండలంలోని ఆలూరులో పుట్టి నడిపి పోశెట్టికి చెందిన 14 గుంటలు, లోలం సులోచనకు చెందిన 15గుంటల వరిపొలం బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక యంత్రం వచ్చేలోగానే పంట కాలి బూడిదైందని ఎంఆర్ఐ ముంతాజ్ తెలిపారు. ఆకతాయిలు పొగతాగి ఆర్పకుండా పారేయడం వల్లే పంటకు నిప్పంటుకుందన్నారు. ప్రమాదంలో దాదాపు రూ.25వేలు నష్టం జరిగినట్లు నిర్ధారించారు.

ఈగలమోత వేగలేమని ఆందోళన

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ తండా సమీపంలోని గుట్టపై ధరణి బ్రీడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్మించిన కోళ్ల విత్తనోత్పత్తి కేంద్రం కారణంగా తమ గ్రామంలో ఈగలమోత ఎక్కువైందని, దీనివల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. విత్తనోత్పత్తి కేంద్రానికి వెళ్లే రహదారిని అడ్డంగా తవ్వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కంపెనీ ఎండీ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే విత్తనోత్పత్తి కేంద్రం నిర్మాణ పనులు కొనసాగుతుండగా దానికి సామగ్రి తరలించే భారీ వాహనాల వల్ల ప్రధాన పైపులైన్ పగిలి నీరందక సైతం ఇబ్బందులు పడుతున్నామని మాపరిస్థితి ఏమిటని గ్రామస్తులు ఆగ్రహించారు. వెంటనే సదరు ఎండీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీఓ స్రవంతి, తహశీల్దార్ సంతోష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సదరు కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్‌తో రాతపూర్వకంగా బ్రీడర్ కేంద్రాన్ని మూసివేయిస్తామని అంగీకార పత్రం రాయించడంతో పాటు 24గంటల్లో ఈగల బెడద పరిష్కరించి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయిస్తామని అంగీకరించడంతో ఆందోళన విరమించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కంపెనీ ఎండీ శ్రీకాంత్

డిగ్రీ 4, 6 సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు



పరీక్షలు వాయిదా వేయాలని వీసీని కోరుతున్న లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు సె మిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎ స్సీ, ఒకేషనల్, బీసీఏ, బీఏ(ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమి స్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. జూన్ 13 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4, 6వ సెమిస్టర్ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూల్స్‌ను విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండడంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈ నెల 22 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్‌ను ప్రకటించాక వేసవిలో ఎండలు మండిపోతున్నాయని, తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే, జూన్‌లో పూర్తయితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్, జూలైలో జరగబోతున్నందువల్ల ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. ఉన్నత విద్యలోని పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశపరీక్షలు అన్ని మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు.

రేషన్ షాపు వద్ద గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పెంబి: లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని మూడు నెలలుగా రేషన్ డీలర్ బియ్యం పంపిణీ చేయడం లేదంటూ బుధవారం షాపు వద్ద లబ్ధిదారులు ఆందోళన చేసిన ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలం శెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ వెలిముద్రలు తీసుకుని మూడు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా స్టాక్ లేవని డీలర్ చెబుతున్నాడని ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హనుమాన్ దుకాణాన్ని పరిశీలించారు. షాప్‌కు తాళం వేసి ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపడుతామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బత్తాయి లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని జాతీయ రహదారి 44పై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బత్తాయి పండ్లతో వెళ్తున్న లారీ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని పోలార్‌కు చెందిన డ్రైవర్ నఫీజ్ అక్కడి నుంచి బత్తాయి పండ్లను లారీలో నాగ్‌పూర్‌కు తరలిస్తున్నాడు. సీతాగోంది వద్దకు రాగానే డీజిల్ ట్యాంక్ మూత పడిపోయి ఉండడంతో సైలెన్సర్ ద్వారా రగిలిన నిప్పురవ్వలు ట్యాంకుకు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి టైర్లు పూర్తిగా కాలిపోవడంతో లారీ నేల కొరిగింది. అప్రమత్తమైన లారీ డ్రైవర్ నఫీజ్ కిందికి దిగి స్థానికుల సహాయంతో పోలీసులను సంప్రదించాడు. దీంతో పోలీసులు అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పి వేసినా అప్పటికే లారీ పూర్తిస్థాయిలో దగ్ధమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.





ఇంటి నుంచి ఫ్యాన్ తెచ్చుకున్న బాలింత



ఇంటి నుంచి కూలర్ తెచ్చుకున్న బాలింత

గాలి ఆడదు.. నీరు అందదు..



రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పిల్లలతో పాటు తల్లులు కూడా వేడికి తట్టుకోలేక ఇంటి నుంచే ఫ్యాన్లు, కూలర్లు తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నారు. దీనికి తోడు తాగునీటి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్